విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 26, జనవరి 2025

నారాయణ జూనియర్ కాలేజీని సీజ్ చేయాలి

- ఆర్ఐవో వెంకటరమణ నాయక్‌ను సస్పెండ్ చేయాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి డిమాండ్

విశాలాంధ్ర-అనంతపురం క్రైం : అనంతపురం నగరం సోమలదొడ్డి సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి చరణ్ మరణానికి కారణమైన నారాయణ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్‌ను సస్పెండ్ చేసి మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారంగా అందించాలని శనివారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూవై, బిసి, మైనార్టీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ వద్ద మానవహారం, ఆందోళన చేపట్టారు. ప్రైవేటు విద్యా సంస్థలు పరీక్షా సమయంలో ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తేవడం కారణంగా విద్యార్థులు మానసికంగా ఆవేదన చెందుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్ళాయిస్వామి ఆరోపిం చారు. మంత్రి నారాయణ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాలు ఫీజుల మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల చదువులపై లేదనే విషయం చైతన్య విద్యార్థి ఆత్మహత్యచేసుకున్న సందర్భంగా తేటతెల్లమైందన్నారు. విద్యార్థుల మరణాలకు కారణమైన ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు ప్రభుత్వం నమోదు చేయడానికి ఎందుకు వెనకాడుతుందని ప్రశ్నించారు. ప్రైవేటు కళాశాలలకు అనంతపురం జిల్లా ఆర్ఐఓ వెంకటరమణనాయక్ తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో వందలాది మంది విద్యార్థులు చనిపోయిన ప్పటికి ఏ జిల్లాలో కూడా కేసులు నమోదు కాకపోవడం సిగ్గు చేటన్నారు. ప్రైవేటు జూ.కళాశాల యాజమాన్యం అధికారాన్ని అడ్డుపెట్టుకొని చలామని అవుతున్నా రని అన్నారు. ఇటీవల ప్రైవేట్ విద్యా సంస్థల హాస్టల్‌లో ఆత్మహత్యలు అధికంగా చోటు చేసుకుంటున్నాయని పోలీసులకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. ఫీజుల రూపంలో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే త్వరలో నారాయణ విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ నగర అధ్యక్షులు మంజునాథ్, సాయి, హర్ష, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, పృథ్వి, సురేష్ యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, జనసేన విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి సిద్ధు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధు, జిల్లా ఉపాధ్యక్షులు గిరి, సోము, గణేష్,వైసీపీ నగర అధ్యక్షులు కైలాష్ పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: విద్యార్థి చావుకు కారణమైన నారాయణ కళాశాల యాజమాన్యాల పైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ఫీజులు వసూలు చేసే దానిమీద ఉన్న శ్రద్ధ విద్యార్థులు ప్రాణాలు కాపాడడంలో లేదా అంటూ శనివారం ఐక్య విద్యార్థి సంఘం నాయకులు స్థానిక వినాయక సర్కిల్ నందు గంటలపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకులు అనిల్ మాట్లాడుతూ జిల్లాలో నారాయణ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి భవనం పైకెక్కి దూకి మరణానికి కారణమైన నారాయణ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేసే దాని మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల ప్రాణాలు కాపాడడంలో నారాయణ విద్యా సంస్థలకు లేదని మండిపడ్డారు. మొన్నటి రోజున నారాయణ కళాశాలలో విద్యార్థి మరణించగా ఇంతవరకు దానిపైన విచారణ జరపకుండా ఆ కళాశాలల వైపు కన్నెత్తి చూడకుండా నారాయణ విద్యాసంస్థలకు వత్తాసుగా పని చేస్తున్న ఆర్ఐఓను తక్షణమే సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేశారు. గతంలో నారాయణ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధన విరుద్ధంగా పుస్తకాల అమ్ముతున్నారని, అక్కడ ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు తెలిపినప్పటికీ మంత్రి పదవిలో నారాయణ ఉన్నారు మా ఉద్యోగం పోతాయని జిల్లా పెద్దలు అక్కడికి రాకుండా భయపడడం సరైనది కాదన్నారు. ఒక బిల్డింగ్లో 1500 నుండి 2000 మంది విద్యార్థులకు విద్యాబోధన బోధిస్తుశ్రీఛ్రశ్రీ నారాయణ విద్యాసంస్థల కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజు, తరుణ్, మున్నా, భాను, అఖి, విష్ణు, పవన్ , రాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు వలి, అనిల్ గణేష్, ఇర్ఫాన్, వంశీ , దేవరాజ్ ఎన్ఎస్‌యుఐ నాయకులు దిలీప్, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

విశాలాంధ్ర-అనంతపురం: నేటి యువత, ఓటు హక్కు లేనివారు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించాలని జేసీ శివ్‌నారాయణ్ శర్మ పేర్కొన్నారు. శనివారం జనవరి 25వ తేదీన 15 వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అనంతపురం ఆర్ట్స్ కాలేజీ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీవో లు తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ ఈ సంవత్సరం థీమ్ "ఓటింగ్ సమానమైనది ఏమీ లేదు, నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను" అనేది ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కొత్త ఓటర్ల నమోదును ప్రోత్సహించడంతో పాటు ఇటీవల అర్హత పొందిన యువతీ, యువకులు. దేశవ్యాప్తంగా, జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లను సత్కరించి వారి ఎలెక్టర్ ఫోటో ఐడెంటిటీ కార్డ్ (ఈపిఐసిఈ)ని అందజేస్తామని తెలిపారు. ఈ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో భారతదేశ ఎన్నికల సంఘం రూపొందించిన ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్‌లు శివలింగమ్మ, నల్లమ్మకు సన్మానం చేశారు. నూతన యువ ఓటర్లు సాయికుమార్, చరణ్, జ్యోత్స్న, ఈశ్వర్ సాయి, సాయికృష్ణ, స్రవంతిలకు ఎపిక్ కార్డులు అందజేసి ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకోవాలని తెలిపారు. జూ.కళాశాల స్థాయిలో వ్యాసరచన పోటీలలో సంబంధించి ఎస్. అమృత మొదటి స్థానం, దీపిక రెండవ స్థానం, మల్లీశ్వరి మూడవ స్థానంలో నిలవగా బహుమతులు అందజేశారు. వక్తృత్వ పోటీలకు సంబంధించి లక్ష్మి నవ్య శ్రీ మొదటి స్థానం, మల్లికా రెండవ స్థానం, రిఫాత్ మూడవ స్థానంలో బహుమతులు అందజేశారు. పాఠశాల స్థాయిలో వ్యాసరచనలో హర్షవర్ధన్ మొదటి స్థానం, మేఘన రెండవ స్థానం, పూర్ణ పుష్కల మూడవ స్థానంలో బహుమతులు అందించారు. వక్తృత్వ పోటీలకు సంబంధించి కళ్యాణ చక్రవర్తి మొదటి స్థానం, ఎం.హర్షవర్ధన్ రెండవ స్థానం, చి.దుర్గ మూడవ స్థానంలో బహుమతులు అందజేశారు. అనంతపురం జిల్లాలో ఎలక్షన్ సెల్‌కి సంబంధించి ఉత్తమ సేవలందించిన డిప్యూటీ తహసీల్దార్లు శ్రీమతి సుజాత దేవి, నాగేంద్రాప్రసాద్ లకు, సీనియర్ అసిస్టెంట్‌లు ఎస్.వి ప్రసాద్, శ్రీనివాసులు, ఐటి సపోర్ట్ టీం, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీవోలు కేశవ నాయుడు, వసంత్ కుమార్, ఇ.ఆర్.ఓలు శిరీష, మల్లికార్జున, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్,డివిఈఓ వెంకటరమణ నాయక్, జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏఓ అలెగ్జాండర్, సమాచార పౌర సంబంధాల అధికారి గురుస్వామి శెట్టి పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

కౌలు రైతు సంఘం నాయకులు

విశాలాంధ్ర-శింగనమల : పుట్లూరు మండలం ఓబులాపురం గ్రామంలో హఠాన్మరణం చెందిన రైతు పుల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి సత్తార్, డిమాండ్ చేశారు. శనివారం కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీటి రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సత్తార్‌లు మాట్లాడుతూ, నిన్న రాత్రి పుట్లూరు మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన రైతు పుల్లయ్య వయసు 45 సంవత్సరాలు హఠాత్తుగా మరణించారని, పుల్లయ్యకు ఇద్దరు కుమారులు. తనకున్న మూడు ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, పొలంలో పంటలు సాగు చేయడానికి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేక అతివృష్టి అనావృష్టి కారణాలతో పంటలు దిగుబడి లేక కృంగిపోయి రైతు హఠాత్తుగా మరణించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకుంటా మని హామీలు ఇవ్వడంతోనే ప్రభుత్వం పైన రైతులు చాలా ఆశలు పెట్టుకొని ఎదురుచూస్తున్న పరిస్థితులు ఏర్పడ్డాయని,ప్రభుత్వం ఏర్పడి దాదాపు 8 నెలలు గడుస్తున్నా రైతుల పట్ల రైతాంగం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా ఆదుకోకుండా వ్యవహరిస్తు న్నారని మండిపడ్డారు. తక్షణమే రైతన్న ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్ యాదవ్, గోపాలకృష్ణ, బాల గుర్రయ్య, అంకిరెడ్డి, కుల్లాయప్ప, నాగపుల్లయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

ఆదర్శ సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న కలెక్టర్

విశాలాంధ్ర-అనంతపురం: 2024లో ఎన్నికల నిర్వహణలో చేసిన ఆదర్శప్రాయమైన సేవలకు గుర్తింపుగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ప్రశంసా పత్రం అందించారు. భారత ఎన్నికల సంఘం, 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం -2025 పురస్కరించుకొని విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 2024లో ఎన్నికల నిర్వహణలో చేసిన

ఆదర్శప్రాయమైన సేవలకు గుర్తింపుగా వినోద్ కుమార్‌కి ప్రశంసాపత్రం అందజేశారు.

మహిళ ప్రాణాలను కాపాడిన యువకులను సన్మానించిన పోలీసులు

విశాలాంధ్ర-ఉరవకొండ : ప్రమాదవశాత్తు నీటిలో పడి కొట్టుకుపోతున్న మహిళను ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కాపాడిన ఇద్దరు యువకులను శనివారం ఉరవకొండ రూరల్ సిఐ చిన్నగౌస్, అర్బన్ సిఐ మహానంది, ఎస్సై జనార్దన్ నాయుడు సర్కిల్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. బుధవారం రాయంపల్లి గ్రామానికి చెందిన సునీతమ్మ తన పిల్లలతో కలిసి గ్రామ శివారులోని హెచ్చెల్సీ వద్ద దుస్తులు ఉతికేందుకు వెళ్లారు. పని పూర్తి కాగానే గట్టున నిల్చొని కాళు,, చేతులు కడుక్కుంటుండగా కళ్లు తిరిగి కాలువలో పడిపోయింది. కుమార్తె వర్ష రోదిస్తూ కేకలు పెట్టింది, అదే సమయంలో బెళుగుప్పకు చెందిన లింగప్ప ద్విచక్ర వాహనంలో ఉరవకొండకు వెళ్తూ చిన్నారి అరుపులు విని నీటి ప్రవాహం అధికంగా ఉన్నా.. ప్రాణాలను లెక్క చేయకుండా వెంటనే కాలువలోకి దూకి మహిళను కాపాడారు. మరో యువకుడు ఎర్రిస్వామి సాయంతో ఆమెను సురక్షితంగా గట్టుకు చేర్చారు. బంధువులు, స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని యువకులను అభినందించారు. బాధితురాలు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కాగా నీటిలోకి దూకినప్పుడు ఎర్రిస్వామి అనే యువకుడి సెల్ఫోన్ కాలువలో పడిపోయింది. సెల్‌ఫోన్‌ను పోలీస్ అధికారులు కొనిచ్చి, వారిద్దరినీ అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బుల్లెట్ కన్నా బ్యాలెట్ మిన్న

విశాలాంధ్ర-గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం గుత్తి తహసీల్దార్ డి ఓబులేసు ఆధ్వర్యంలో శ్రీ సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులతో స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఓటు జన్మ హక్కు, బుల్లెట్ కన్నా బ్యాలెట్ మిన్న తదితర నినాదాలతో ర్యాలీ ముందుకు సాగారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు.. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ లలిత ,సివిల్ సప్లై తహశీల్దార్ సూర్జి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ డాక్టర్ సందీప్,, మండల సర్వేర్ సాయి, వీఆర్వోలు వివిఎస్లు, వీఆర్ఏలు శ్రీ సాయి డిగ్రీ కళాశాల సిబ్బంది రంగస్వామి రెడ్డి, స్వరూప, రజని, శేఖర్, ప్రకాష్, యాగంటి, రామాంజనేయులు, నిజాముద్దీన్‌పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త నిస్సార్ అహ్మద్ ఆత్మహత్య..

విశాలాంధ్ర, అనంతపురం క్రైం: ప్రింటింగ్ ప్రెస్‌లో చిరుద్యోగిగా జీవితాన్ని ఆరంభించి ప్రింటింగ్, ప్రెస్‌లోపనిచేసే కార్మికుల సంక్షేమం కోసం సంఘాన్ని ఏర్పాటు చేసి వారి హక్కుల్ని కాపాడే సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన సామాజికకార్యకర్త నిస్సార్ అహ్మద్ శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. నగరంలోని ఎర్రనేల కొట్టాలలో నివాసముంటున్న నిస్సార్ అహ్మద్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇంట్లో నుంచి రెండు రోజుల క్రితం

బయటకు వచ్చేసిన నిస్సార్ అహ్మద్ నగరంలోని రాజధాని లాడ్జిలో రూమ్ బాడుగకు తీసుకొని లాడ్జిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. నిస్సార్ అహ్మద్ నగరంలోనే కాదు జిల్లాలో చాలా ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులకు దగ్గరగా పరిచయం ఉన్న సామాజిక కార్యకర్త. జిల్లాలో జరిగే వామపక్ష పోరాటాల్లో అనేక పౌరహక్కుల, సామాజిక ఉద్యమాల్లో పాల్గొని ప్రస్తుతం మహాజన సంఘర్షణ సమితిని ఏర్పాటు చేసుకుని సామాజిక సమస్యలపై పోరాటం చేస్తున్నారు. పలువురు నాయకులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే మార్చురికి వెళ్లి నిస్సార్ అహ్మద్ మృతదేహాన్ని చూసి ఆయన పోరాటాలను గుర్తుచేసు కొని ఘనంగా నివాళులర్పించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ ఎన్నికల నిర్వహణ అధికారిగా ఎస్పీ జగదీష్

విశాలాంధ్ర-అనంతపురం క్రైం : ఎస్పీ జగదీష్ ఉత్తమ ఎన్నికల నిర్వహణ అధికారిగా పురస్కారం అందుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికలను ఎస్పీ జగదీష్ పారదర్శక తతో సమర్ధవంతంగా నిర్వహించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించినందుకు ఎస్పీని "ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కా రానికి ఎంపిక చేశారు. ఈనేపథ్యంలో విజయ వాడలోని తుమ్మల పల్లి కళాక్షేత్రంలో జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతులమీదుగా ఎస్పీ పి.జగదీష్ ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారాన్ని అందుకున్నారు.

దొడగట్టలో పశువైద్య శిబిరం

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంలోని దొడగట్ట గ్రామం లో శనివారం పశు ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పశు వులకు గొర్లకు టీకాలు వేసి రోగాల నుంచి ఎలా కాపాడుకోవాలి అని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోదకుమార్, విఏ. వసంతకుమారి, ఏహెచ్ఏలో వీరారెడ్డి, సంతోష్‌కుమార్, చందువర్ధన్, తేజకుమార్, రమ్యశ్రీ ఐత్తరప్ప పాల్గొన్నారు.

వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షునిగా రామాంజనేయులు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్ : అనంతపురం జిల్లా వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షునిగా తిమ్మగానపల్లి గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు ఎంపిక చేశారు. పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం నాపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అహర్నిశలు పనిచేసి కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. నాకు సహకరిం చిన నియోజకవర్గ ఇన్‌చార్జి పీడీ రంగయ్యకు, ఉమామహేశ్వర్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: కళ్యాణదుర్గం, కంబదూరు లో మోరెపల్లి మల్లికార్జున, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కరణం రాంమోహన్ చౌదరి, గాజుల శ్రీరాములు, అమిలినేని లక్ష్మీనారాయణలు విద్యుత్ అధికారులు డీఈ, ఏడి, ఏఈలు ఆధ్వర్యంలో శనివారం రైతులకు ట్రాన్స్ ఫార్మర్స్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఒక రైతుబిడ్డ కాబట్టి గత రెండేళ్ల నుండి పడుతున్న రైతుల కష్టాలు తెలుసుకుని ఇప్పటికి 150 మందికి పంపిణీ చేయించారని, వారం రోజుల్లో మిగతా వారికీ కూడా ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో బంట్రోతి మంజునాథ్, ముదిగల్లు ఐదవ వార్డ్ ఇంచార్జ్ మంజు, కోడిపల్లి తిమ్మరాజు, వడ్డే రమేష్, కంకర మిషన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

బైక్‌పై నుండి పడి మహిళ మృతి

విశాలాంధ్ర-బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పిల్లల పల్లి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం నుంచి తిప్పక్క (55) జారిపడి శుక్రవారం రాత్రి మృతి చెందింది. తిప్పక్క తన కుమారుడు హనుమంత రాయుడితో కలిసి ద్విచక్ర వాహనంలో గుమ్మగట్టకు వెళ్లారు. తిరిగి పిల్లలపల్లికి వెళుతుండగా కళ్లు తిరిగి జారి కింద పడిం మృతి చెందింది. ఎస్సై నాగేంద్ర కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అర్హులైన రైతులకు ఫిబ్రవరిలో డ్రిప్ పరికరాల పంపిణీ

ఏపీఎంఐపీ అధికారులతో కాలవ సమీక్ష

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : అర్హులైన రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ చేయాలని ఏపీఎంఐపీ అధికారులను ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రభుత్వం సబ్సిడీపై మంజూరు చేస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తపరిచారు. దరఖాస్తు దారులు తమవంతు డబ్బు చెల్లించినా పరికరాలు మాత్రం అందలేదన్నారు. దరఖాస్తు చేసిన వారికి వెంటనే పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించగా... ఫిబ్రవరి మొదటి వారంలో తొలివిడత పంపిణీ ఆరంభిస్తామని ఏపీఎంఐపీ పిడి రఘునాథరెడ్డి వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 5052 మంది రైతులు 6543 హెక్టార్లలో సబ్సిడీ పరికరాల కోసం దరఖాస్తు చేయగా అందులో 2740 మందికి సంబంధించిన 3214 హెక్టార్లలో క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి అయిందని తెలియజేశారు. వారిలో 883 మంది రైతులు 983 హెక్టార్లలో పరికరాలకు లబ్దిదారుల వాటా మొత్తం చెల్లించా రన్నారు. ఇప్పటి వరకు 824 మందికి చెందిన 924.36 హెక్టార్లకు పాలనా ఆమోదం లభించినట్లు వెల్లడించారు. వీరిలో తొలిదశ కింద కనీసం 500 మందికి ఫిబ్రవరి మొదటి వారంలో పంపిణీ చేస్తామని తెలిపారు. రాయదుర్గం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పంపిణీకి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఏపీఎంఐపీ ఏడీ ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మూడు కేజీల గంజాయి స్వాధీనం

-ఏడుగురు నిందితుల అరెస్టు

విశాలాంధ్ర-రాప్తాడు : అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాప్తాడు సీఐ టీవీ శ్రీహర్ష ప్రత్యేక దృష్టి సారించి మూడు కేజీల గంజాయితో పాటు ఏడుగురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈమేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు శనివారం రాప్తాడు డీఎస్పీ కార్యాల యంలో విలేకరులతో మాట్లాడుతూ అనంతపురంలోని మారుతీ నగర్ రెండో క్రాస్ సాయిబాబా గుడి వద్ద నివాసం ఉంటున్న కదిరి మండలం కొండమ నాయునిపల్లి గ్రామానికి చెందిన పూల సునీల్‌కుమార్, తాడిపత్రి టౌన్ పోరాట కాలనీకి చెందిన మండ్ల కుళ్లాయప్ప, అనంతపురం నవోదయ కాలనీకి పోకల విజయ్ కుమార్ గంజాయి అమ్ముతూ అనంతపురం రూరల్ మండలం కాట్నేకాలువ గ్రామానికి చెందిన ఎర్రగుంట చంద్రకాంత్ రెడ్డి, అనంతపురం టౌన్ అంబేద్కర్ నగర్ బండారు శివప్రసాద్, రామకృష్ణ కాలనీకి చెందిన గొల్ల క్రాంతికుమార్, మంగలోళ్ల కాలనీకి చెందిన బెస్త భానుప్రకాష్ లకు రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి రైల్వే గేటు సమీపంలో గంజాయి సరఫరా చేస్తున్నారు. శనివారం ఉదయం సంఘటన స్థలంలో ఏడుగురు నిందితులు గంజాయిని విక్రయించడానికి గుమికూడి ఉండగా పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టుచేసి రిమాండుకు పంపారు. కార్యక్రమంలో సిబ్బంది భాస్కర్, తిప్పేస్వామి, రుద్రవీరచౌదరి, లాల్ ప్రసాద్, శ్రీనివాసులు ఉన్నారు.

సూపర్ సిక్స్-సూపర్ ఫ్లాప్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: ఎన్నికల ముందు చెప్పిన సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేర్చాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వై.మధుసూదన్ రెడ్డి, షాలీ దాదా గాంధీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలా రెడ్డి పిలుపు మేరకు శనివారం థాలీ భజావో కార్యక్రమం పేరిట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందర ప్లేట్లు - స్పూన్లతో పెద్ద శబ్దం చేస్తూ మొద్దు నిద్రలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని నిద్రలేపే కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ అనంతరము ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిసిసి అధ్యక్షులు వై.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి 227 రోజులు కావస్తున్నప్పటికీ ఇంత వరకు సంక్షేమ పెన్షన్లు, ఉచిత గ్యాస్ తప్ప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, పథకాలను అమలు చేయలేదన్నారు. యువతకు రూ. 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.రూ.3000 నిరుద్యోగ భృతి, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15000, ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి రూ.15000 ఇస్తా మని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రతి రైతుకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయం, ప్రతి మహిళకు(వయస్సు 18-59) నెలకు రూ.1500 రూపాయలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పారు కానీ ఆచరణలో మాత్రం ఉచిత గ్యాస్ సిలిండర్ ఒకటి మాత్రం ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులు అర్థాంతరంగా చదువులకు దూరం అవుతున్నారని, 12వ పిఆర్సీ వేయకపోవడం న్యాయమా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో షర్మస్, వాలి కొండరెడ్డి, ఇమామ్, సూర్యనారాయణ రెడ్డి, హరి, రాయల్ కృష్ణ, శంకర్ రాయల్, రామాంజి, గాలి మల్లి కార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎయాన్సీ ఇండియాతో జేఎన్టీయూ ఒప్పందం

విశాలాంధ్ర-జెఎన్టియు ఏ: జేఎన్టీయూ అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల లో ఈసీ ఈ విభాగం ఎయాన్సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బెంగళూరు ప్రతినిధి జయప్రకాశతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నారెడ్డి తెలిపారు. ఈ ఒప్పందం విద్యార్థులకు కొత్త అవకాశాలను తెలిపి వారి కెరీర్‌ను పురోగతి పథంలో నడిపించేందుకు దోహదం చేస్తుందని తెలిపారు. ఆచార్య జి.మమత మాట్లాడుతూ పారిశ్రామిక అవగాహన పెంచే విధంగా శిక్షణా కార్యక్రమాలు, పరిశోధనా అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం పెంచవచ్చన్నారు

గుత్తిలో స్వచ్ఛ ఆంధ్ర బి స్వచ్ఛ దివస్

విశాలాంధ్ర-గుత్తి: గుత్తి మునిసిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా ఆధ్వర్యంలో శనివారం పట్టణ పరిశుభ్రతపై, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, మెప్మా వారి ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు పాఠశాలల సిబ్బంది పట్టణ ప్రధాన రోడ్లు, స్థానిక కూరగాయల మార్కెట్లో పరిశుభ్రత పనులు చేయించారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి వారు, దుకాణదారులు తడిచెత్త,పొడిచెత్తను వేరుగా చేసి ప్రత్యేక చెత్త బుట్టలలో నిల్వ ఉంచి మునిసిపల్ వాహనానికి అందించడం ద్వారా దంపింగ్ యార్డ్‌కు తరలిం చడం జరుగుట ద్వారా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ భాషా, పట్టణ టిడిపి అధ్యక్షుడు యం.కె చౌదరి, మాజీ కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

పేరు ప్రతిష్టను పెంచినది కౌన్సిలర్సే

విశాలాంధ్ర-తాడిపత్రి: తనకు రెండు రాష్ట్రాల్లో పేరు ప్రతిష్టలు తెచ్చి పెట్టినది తన కౌన్సిలర్లేనని మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అభివృద్ధికి సంబంధించి 11 అంశాలను, 2025-26 సంబంధించి మున్సిపల్ బడ్జెట్ ను కౌన్సిలర్ సభ్యులు ఆమోదించారు. కౌన్సిలర్ సమావేశం అనంతరం జేసి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తన కౌన్సిలర్స్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, ప్రస్తుతం కానీ కౌన్సిలర్లు ఎన్ని కష్టాలు వచ్చినా నా వెంటే ఉంటూ తాడిపత్రి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వామిలవుతున్నారన్నారని కంటతడి పెట్టారు. తన రాజకీయ ప్రస్థానంలో ఇలాంటి కౌన్సిల్ సభ్యులను చూడలేదని కొనియాడారు. ఇప్పటినుండి కూడా కౌన్సిల్ సభ్యులందరూ కలిసి తాడిపత్రి మున్సిపల్ అభివృద్ధి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మంగపట్నం లక్ష్మీదేవి, తలారి అరుణ, బోసి అంజనమ్మ, జింకా లక్ష్మీదేవి, మల్లికార్జున పాల్గొన్నారు.

జనసేన పార్టీకి గాజు గ్లాస్ గుర్తు

విశాలాంధ్ర-శింగనమల: జనసేన పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోగుర్తింపు పొందిన పార్టీల జాబితాలో చేర్చిందని, జనసేనకు గాజు గ్లాస్ గుర్తు రిజర్వ్ చేసిందని జనసేన పార్టీ మండల అధ్యక్షులు తోట ఓబులేసు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ,సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్రేట్ తో విజయం నమోదు చేసిన పార్టీగా జనసేన రికార్డు సాధించి,పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లో,2 లోక్ సభ స్థానాల్లో అఖండ విజయాన్ని సొంతం చేసుకొని జనసేన రికగ్నైజ్డ్ పార్టీగా నిలిచి గాజు గ్లాస్ గుర్తు రిజర్వ్ చేసుకుందన్నారు. దశాబ్ది కాలానికి పైగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పడ్డ కష్టానికి ప్రతిఫలమే ఎన్నికల సంఘం జనసేన పార్టీకి గుర్తింపన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 26, జనవరి 2025

అధైర్యపడవద్దు అండగా ఉంటాం..

- వికలాంగ పిల్లలకు ఆర్థిక సాయం
- తక్షణ సాయం 10 వేల అందజేసిన లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమా నందన్
- విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-లేపాక్షి : లేపాక్షి ఎస్సీ కాలనీలో నివాసం ఉంటూ ఇద్దరు కుమారులు అంగవైకల్యం పాటు జెనెటిక్ వ్యాధితో బాధపడుతూ ఉన్న పరిస్థితిని విశాలాంధ్ర ప్రత్యేక కథనం ఎందుకు శాపం ఎవరిదీ పాపమనే చీరికకు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమా నందన్ స్పందించారు. శనివారం సాయంత్రం సూర్య ప్రకాష్ కుటుంబ సభ్యులను చైర్మన్ రమా నందన్ పరామర్శించి పిల్లల ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం నరాల బలహీనతతో పాటు 14 ఏళ్లగా వికలాంగులుగా ఉన్న పిల్లలను చూసి చెల్లించి నా ఆయన తక్షణ సాయం కింద 10వేల రూపాయలు నగదును కుటుంబ సభ్యులకుఅందజేశారు. ఎలాంటి ఇబ్బందులు కలిగిన తమ దృష్టికి తీసుకురావాలని భవిష్యత్తులో తన వంతు బాధ్యతగా ఆ పిల్లల సంరక్షణకు జీవనానికి సహాయ సహకారాలు అందిస్తూ ఉంటానని తెలిపారు. ఇంతటి మానవత్వంతో స్పందించిన చైర్మన్‌కు స్థానిక సర్పంచ్ ఆదినారాయణతో పాటు ఎస్సీ కాలనీ యువత అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో చిన్నారులకు ఎలాంటి వైద్య సదుపాయమైన అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మరణించిన నారాయణ విద్యార్థి చరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్..

విశాలాంధ్ర బ్యూరో, శ్రీ సత్యసాయి : అనంతపురం నగరంలో నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి కళాశాల భవనం పైనుంచి దూకి మరణించిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న శ్రీ సత్య సాయి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమా యాదవ్ అనంతపురం జిల్లా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలంలోని మృతుని చరణ్ వారి నివాసంలో కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ కళాశాలలో ఫీజుల చెల్లించ లేదని విద్యార్థిని వేధింపులకు గురిచేయడం వలన మనస్థాపానికి గురై కళాశాల భవనం మూడవ అంతస్తు నుండి దూకి మరనించడం బాధాకరం అన్నారు. కళాశాల భవనం నిబంధనకు విరుద్ధంగా ఉండడం అందుకు అనుమతులు మంజూరు చేసిన అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ విద్యార్థి మృతి చెందడం బాధాకర విషయం అని విద్యార్థి కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటించి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని విద్యార్థి చరణ్ మృతి పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మధు, ఏఐటియుసి అనంతపురం జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుళాయి స్వామి, సత్యసాయి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి రాష్ట్ర సమితి సభ్యులు వంశీ, మంజునాథ్, అరుణ్ కుమార్‌రెడ్డి, మూర్తి, సిపిఐ బత్తలపల్లి నాయకులు కాటమయ్య, బండల వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులలో రాజకీయ ఒత్తిళ్లు తగ్గించాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి: ఉపాధి హామీ కూలీల పనులలో రాజకీయ నాయకులు ఒత్తిళ్లు తగ్గించాలని సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఏపీ వ్యకాసం రాష్ట్ర పిలుపుమేరకు ఉపాధి హామీ పిడి విజయ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేమయ్య యాదవ్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి,రోజుకు 700 రూపాయలు చెల్లించాలన్నారు. జాబ్ కార్డ్‌తో నిమిత్తం లేకుండా అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించి సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. రైతులు వ్యవసాయ కూలీ పనులు లేక వలసలు వెళ్లి జీవనం సాగిస్తున్నారని వారిని తిరిగి వారి గ్రామాలకు రప్పించి ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలాస్వామి, కుల్లాయప్ప మాట్లాడుతూ వ్యవసాయానికి సాగునీరు అందిస్తే ఉపాధి అవకాశాలు పుష్కలంగా పెరుగుతాయి అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, సిపిఐ పట్టణ కార్యదర్శి వినోద్ కుమార్,చిన్న పెద్దన్న, రామాంజనేయులు, సాకే మారెప్ప, ఆదినారాయణ కదిరప్ప ,వివిధ మండలాల వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

గాయపడిన జింకను అటవీశాఖ అధికారులకు అప్పగింత

విశాలాంధ్ర-రొళ్ల: మండల పరిధిలోని హనుమంతనపల్లి గ్రామ సమీపంలో పంట పొలాలల్లో అడవి నుంచి వచ్చిన జింకను శనివారం కుక్కలు వెంబడించి కాటు వేయడంతో జింక ప్రమాదానికి గురి అయింది జింకను హనుమంతనపల్లి గ్రామానికి చెందిన నవీన్ కుమార్ చరవాణి ద్వారా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. అనంతరం ఎఫ్.బి.ఓ సంజీవ రాయుడు స్పందించి ఘటన స్థలానికి చేరుకొని జింకను పరిశీలించి స్థానిక పశు వైద్యశాలకు తరలించి జె.వి.వో వెంకటేష్ ప్రథమ చికిత్స నిర్వహించారు.అనంతరం మెరుగైన చికిత్స కోసం మడకశిర పశు వైద్యశాలకు తరలించారు. అడవికి నిప్పు అంటించే అడవిని వన్యప్రాణు లకు వేటాడే వారి సమాచారాన్ని అటవీ శాఖ అధికారులకు ప్రజలు సమాచారం ఇవ్వాలని అడవిని మరియు వన్యప్రాణు లను కాపాడే బాధ్యత మన అందరిదని ఎఫ్.బి.ఓ సంజీవ రాయుడు ప్రజలకు తెలిపారు.

కళాశాలకు కంప్యూటర్ల వితరణ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు పట్టణానికి చెందిన పల్లెం వేణుగోపాల్ మూడు కంప్యూటర్లను దాదా పల్లెం వేణుగోపాల్ కళాశాల చైర్మన్ బండి వేణుగోపాల్ ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. దాత పల్లం వేణుగోపాల్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థినీలు ఈ కంప్యూటర్లను సద్వినియోగం చేసుకొని కళాశాలకు మంచిపేరు తేవాలని తెలిపారు. అనంతరం కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ దాతకు కృతజ్ఞతలను తెలియజేశారు.

అసమానతలు లేని దేశాన్ని నిర్మిద్దాం

విశాలాంధ్ర-ధర్మవరం: భారత రాజ్యాంగాన్ని కాపాడు కాపాడుకోవాలని అసమానతలు లేని భారతదేశాన్ని నిర్మిద్దామని ముఖ్య అతిథి సీనియర్ న్యాయవాదులు అతావుల్లా, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు, పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున తెలిపారు. శనివారం ఎస్ఎఫ్ఐ జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా స్థానిక పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ స్వేచ్ఛ ప్రజాస్వామ్యం సమానత్వం ప్రతి పౌరుడికి ఆదేశిక హక్కులతో సాధికారత కల్పిస్తుందని, అయితే కేంద్రంలో ఉండే బిజెపి ప్రభుత్వం ఇటీవల అనేక చట్టాలను సవరణ చేయడం ద్వారా రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తోందని మండి పడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున ఎస్ఎఫ్ఐ నాయకులు ఏకాంత్, హరి పాల్గొన్నారు.

సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర-ధర్మవరం : ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ సీటు బెల్టుతో వాహనాలు నడపాలని డీఎస్పీ హేమంత్ కుమార్ అన్నారు. శనివారం డీఎస్పీతో పాటు సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పట్టణ పురవీధులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిఎస్పీ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని తెలిపారు. పిల్లలకు మైనర్లకు టూవీలర్లు ఇచ్చి వాహనాలను నడిపించినచో, తల్లిదండ్రులకు జరిమానా విధించి కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వన్టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్. సీఐ రెడ్డప్ప రామగిరి సీఐ శ్రీధర్ ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ సిబ్బందిపై విచారణ

విశాలాంధ్ర-నంబులపూలకుంట : మండల పరిధిలోని పి.కొత్తపల్లి అంగన్వాడీ సిబ్బందిపై వచ్చిన ఆరోపణలపై సిడిపిఓ రాధిక, సూపర్వైజర్ నరసమ్మతో కలిసి శనివారం విచారణ చేపట్టారు. శుక్రవారం అంగన్వాడీ కార్యకర్త కవితా రాణి, ఆయా నరసమ్మ సెంటర్ దగ్గర బాహాబాహీకి దిగిన విషయం తెలుసుకున్న సిడిపిఓ ఇరువురికి మెమోలు జారీ చేసి మూడు రోజుల్లోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆయా నరసమ్మ దగ్గు, ఆయాసంతో విధులు నిర్వర్తిస్తున్నారు.. కాబట్టి తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపదలుచుకోలేదని గ్రామస్తులు సిడిపిఓకి వినతిపత్రం అందించారు. సిడిపిఓ స్పందించి సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించి నివేదిక సమర్పించాలని సూచించారు.

మహిళా ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి..

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏపీ జేఏసీ అమరావతి, సత్యసాయి జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు సమావేశమై మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా చర్చించారు, ముఖ్యఅతిథిగా ఏపీ జేఏసీ అమరావతి డిస్ట్రిక్ట్ చైర్మన్ మైనుద్దీన్ హాజరై మహిళా ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సంఘం డిస్టిక్ వైస్ ప్రెసిడెంట్ గిరిధర్, డిస్టిక్ వైస్ చైర్మన్ మహిళా విభాగం ప్రభావతమ్మ, ఇతర శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ పంట నమోదును చేసుకోండి

విశాలాంధ్ర -అగళి : బోరు బావుల కింద రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు తమ పంటలను సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందితో నమోదు చేయించుకోవాలని ఏఓ శేఖర్ నాయక్ తెలిపారు. శనివారం మండలంలోని ఆగళి, ఇరిగేపల్లి రైతు సేవ పరిధిలోని రైతు పొలాలను మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ పరిశీలించి నమోదు ప్రక్రియ స క్రమంగా జరుగుతుందా లేదా అని తనిఖీ చేశారు.గ్రామ రైతులు సాగుచేసిన పంటలను తనిఖీ చేసే అంతర్జాలంలో నమోదు తనిఖీ వివరాలు పొందుపరచాలని రైతు సేవా కేంద్రం సిబ్బంది కి సూచించారు. 2025 రబీ పంట మండలంలో వివిధ గ్రామాల్లో వేరుశనగ రాగులు మొక్కజొన్న కూర గాయలు తదితర పంటలు 310 ఎకరాలు పంట నమోదు జరిగిందని గడువు దగ్గర పడుతున్నందున రైతులందరూ వెంటనే పంట నమోదు చేయించుకోవాలని కోరారు.

రహదారి నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: రహదారి నియమ నిబంధనలు డ్రైవర్లు తప్పక పాటించాలని రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి, కంటి వైద్య నిపుణులు సంకారపు నరసింహులు తెలిపారు. శనివారం మధు కంటి వైద్యశాలలో జాతీయ రహదారి (ప్రయాణ) భద్రత మాసోత్సవాలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన క్లినిక్ లో ఈనెల 16 నుండి ఫిబ్రవరి 15వ తేదీ వరకు వివిధ ప్రభుత్వ ప్రైవేట్ వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించ నున్నట్లు తెలిపారు. మానవ తప్పిదాలవలనే నేడు ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు. ప్రమాదం జరిగిన గంటలోపు (గోల్డెన్ హౌస్ హవర్) చికిత్స సౌకర్యం కలిగిస్తే చాలా మరణాలను నివారించే అవకాశం ఉందని తెలిపారు.జాతీయ రహదారుల వెంట అనుగుణంగా 50 కిలోమీటర్లకు ఒకచోట ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. వాహన డ్రైవరుకు దృష్టిలోపం ఉంటుందని, కంట్లో శుక్లము బట్టకు తెర కట్టినట్లు అగుపిస్తుందని, కావున విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

శివమాలదారుడిపై దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలి

విశాలాంధ్ర పెనుకొండ : పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన మైనార్టీ నాయకున్ని వెంటనే అరెస్టు చేయాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సర్కిల్లో ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. పట్టణానికి చెందిన చెందిన శ్రీనివాసులు ఆటో డ్రైవర్ అనే వ్యక్తి శివ మాల వేసుకుని ఉండగా తెలుగుదేశం పార్టీ నాయకుడు దాదు, ఆటో డ్రైవర్ దాడికి పాల్పడ్డాడు. రహదారి విషయంపై శ్రీనివాసులపై దాడి చేశాడంటూ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో రెండు గంటలపాటు ధర్నా చేపట్టారు. దాడి చేసిన ముస్లిం మైనార్టీ నాయకుడు దాదుని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఇక్కడికి చేరుకొని ఎంత సర్దిచెప్పినా వినలేదు. దాడికి పాల్పడిన దాదుని అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.

ఓటు హక్కుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.. ఆర్డీవో



విశాలాంధ్ర-ధర్మవరం : ఓటు హక్కు తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఆర్డిఓ మహేష్ తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఓటర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని 26 మంది మహిళలచే ముగ్గుల పోటీలను నిర్వహించారు. వివేకానంద డిగ్రీ కళాశాల, శ్రీనివాస డిగ్రీ కళాశాల సత్య కృప డిగ్రీ కళాశాల శ్రీ సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులచే నాటిక, స్పీచ్, పాటలు, డ్యాన్సు లాంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీనియర్ సిటిజన్ నరసమ్మ, రామలక్ష్మమ్మ, పుల్లన్న, దివ్యాంగులైన మల్లికార్జున, పార్వతమ్మ, ఊర్మిళలను పూల మాలలతో, శాలువాతో ఘనంగా సత్కరించారు. 18-19 సంవత్సరాలు గల నూతన యువ ఓటర్లకు నూతన ఓటర్ కార్డ్ ఐడి లను పంపిణీ చేశారు. తదుపరి పట్టణంలో ర్యాలీ ప్లే కార్డులతో, ఓటర్ నినాదాలతో నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఆర్డీవో మహేష్ మాట్లాడుతూ ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని, ప్రభుత్వాన్ని మార్చేది, స్థాపించేది ఒక్క ఓటుకే ఉంటుందని తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీలలో గెలుపొందిన శివకుమారి (ప్రథమ బహుమతి), రెండవ బహుమతి ఇంద్రజ, మూడవ బహుమతి వాణి నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలకు, సెకండ్ ప్రైజ్‌గా శ్రీ సాయి డిగ్రీ కళాశాల, మూడవ ప్రైజుగా సత్య కృప డిగ్రీ కళాశాలకు షీల్డ్‌తో పాటు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మారం ఎమ్మార్వో నటరాజ్, తాడిమర్రి ఎమ్మార్వో భాస్కర్ రెడ్డి, ముదిగుబ్బ ఎమ్మార్వో నారాయణస్వామి, బత్తలపల్లి ఎమ్మార్వో స్వర్ణలత, ఎలక్షన్ ఇడిటిగా ఈశ్వరయ్య, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండరు ఆవిష్కరణ

విశాలాంధ్ర-రొళ్ల: విశాలాంధ్ర నూతన 2025"సం"కోర్టు క్యాలెండరును శనివారం మండలంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ మైలారప్ప ఉపాధ్యాయుల జయరంగప్ప, రమేష్ జూనియర్ అసిస్టెంట్ రామాంజినేయులు ఆవిష్కరించారు. బడుగు బలహీన వర్గాలు పేదలు రైతులు కార్మికులు కర్షక పక్షాన నిరంతరం నిలబడి పోరాడే పత్రిక విశాలాంధ్ర అన్నారు ప్రజల సమస్యలను ఎప్పటి కప్పుడు ప్రభుత్వానికి చేర్చే విధంగా పనిచేస్తూ ప్రజల్లో మన్ననలు పొందిందని తెలిపారు.

అంబేద్కర్‌కు నివాళులు



విశాలాంధ్ర-ధర్మవరం: సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు ధర్మవరం పట్టణంలోని 5వ వార్డులో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుత అంబేద్కర్ స్ఫూర్తి భారత రాజ్యాంగం రూపకల్పనలో మాత్రమే కాకుండా సమాజంలో సమానత్వం నెలకొల్పడంలో కీలకమైన పాత్ర పోషించారు అని తెలిపారు. ఆయన సత్యం, న్యాయం, సమానత్వం పట్ల చూపించిన కట్టుబాటు, భారత రాజ్యాంగంలో ప్రతిపాదించిన అవకాశ సమానత్వం వంటి సిద్ధాంతాలు ప్రతీ భారతీయుని జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తాయి అన్నారు. కార్యక్రమంలో 5వ వార్డు బీజేపీ నాయకులు, పట్టణ అధ్యక్షులు జింకా చంద్ర శేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబిలేసు, శ్యామ్ రావు,జింకా రామాంజినేయులు, వడిత్య సోమ్లా నాయక్, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్,గోవిందు కుమార్, నాగమణి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడే వజ్రాయుధమే ఓటు హక్కు



విశాలాంధ్ర-కదిరి: ప్రజాస్వామ్యాన్ని కాపాడే వజ్రాయుధమే ఓటు హక్కుని పలువురు అధికారులు తెలిపారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల నుండి అంబేద్కర్ కూడలి నుండి వేమారెడ్డి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆర్డీఓ వివిఎస్ శర్మ, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఓ పోలప్ప, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ చైతన్యవంతమైన ప్రజా స్వామ్యం కోసం 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు.ప్రజాస్వామ్య ఓటర్ దినోత్సవంపై వ్యాస రచన పోటీ నిర్వహించి విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చెన్న కృష్ణ, పట్టణ సీఐ నారాయణ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటాచలం, డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం అవగాహన ర్యాలీ



విశాలాంధ్ర - హిందూపురం : 15 వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ర్యాలీని హిందూపురం తహసిల్దార్ జి.వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి, కలెక్టర్, 157- హిందూపురం అసెంబ్లీ నియాజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్, సంయుక్త కలెక్టర్ వారి ఆదేశాల మేరకు హిందూపురంలోని బాలాజీ జూనియర్ కాలేజీ విద్యార్థులచే ర్యాలీని హిందూపురం తహసిల్దార్ జి.వెంకటేష్, మునిసిపల్ కమీషనర్ సంగం శ్రీనివాసులు, ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి, సెరికల్చర్ ఏడి సురేష, అధికారులు, పుర ప్రముకుల అధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి మీదుగా ఓటర్ల అవగాహనా కార్యక్రమం ర్యాలీ చేపట్టారు. ఓటును మించి ఏమీలేదు, నేను ఖచ్చితంగా ఓటు వేస్తానని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ మైనుద్దీన్, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ బి.అమరేంద్ర, ఎన్నికల సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, హిందూపురం అర్బన్, బూతుస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం పురపాలక సంఘం కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా వారు విజయవాడలోని కళాక్షేత్రం-తుమ్మంపల్లిలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరై, ఏపీ స్టేట్ ఎలక్షన్ కమిషనర్ వివేక్‌యాదవ్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని పొందడం జరిగింది. ఈ సందర్భంగా పురపాలక సంఘ కార్యాల యంలోని అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఈ అవార్డు మా పురపాలక సంఘం అధికారులకు సిబ్బందికి అంకితమని తెలిపారు. వారి సహాయ సహకారాల వల్లే తాను ఈ అవార్డు పొందడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రోగులకు పండ్లు, బెడ్ల పంపిణీ



విశాలాంధ్ర-ధర్మవరం: శ్రీ పరమపిత వెంకటరమణాచార్య గురువు చారిటబుల్ ట్రస్ట్ 13వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీ యోగిముక్తేశ్వరి మాతాజీ, శ్రీ మోక్షిముక్తేశ్వరి మాతాజీ ఆధ్వర్యంలో ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడం ఎంతో గొప్ప సేవ అని పేర్కొన్నారు. 12 సంవత్సరాలుగా ఈ ట్రస్ట్ చేస్తున్న సేవలు చాలా మహోన్నతమైనవి అని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వైస్ చైర్మన్ అశోక్ కుమార్, కార్యదర్శి రామాంజినేయచారి, ఉప కార్యదర్శి మల్లికార్జున ట్రెజరర్ నాగభూషణ, శిష్యబృందం, బిజెపి నాయకులు శ్యామ్ రావు,డోలా రాజారెడ్డి,బిల్లే శ్రీనివాస్, క్రిష్టాపురం షాహిన్న ,జూటూరు వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా సంవిధాన్ గౌరవ్ అభియాన్

విశాలాంధ్ర-అమడగూరు: మండల పరిధిలోని కసముద్రం గ్రామంలో బిజెపి కేంద్ర, రాష్ట్ర పార్టీ సూచన మేరకు సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం బిజెపి మండలా అధ్యక్షుడు ఉత్తప్ప ఆధ్వర్యంలో మన రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఫోటో, రాజ్యాంగం పుస్తకానికి పూలమాల వేసి ఘన నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఉత్తప్ప, మండల బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

1, SALMAN SHAIK MOHAMMED (OLD NAME) S/O HANEEF SHAIK MOHAMAD H.NO. 16-11-16/E, TIPPU KHAN STREET HINDUPUR-515201 SRI SATHYA SAI DISTRICT (AP) CHANGING MY NAME FROM ***SALMAN SHAIK MOHAMMED*** (OLD NAME) TO ***SALMAN SHAIK MOHAMMAD*** [NEW NAME] HENCE FORTH I AM BEING CALLED AS SALMAN SHAIK MOHAMMAD FOR ALL PURPOSES.

వ్యాధిగ్రస్తులు సరైన సమయంలో మందులు వాడాలి

విశాలాంధ్ర-చెన్నేకొత్తపల్లి: వ్యాధిగ్రస్తులు సరైన సమయంలో మందులు వేసుకోవడం వల్ల జబ్బులు నయమవుతాయని డాక్టర్ రవినాయక్ సూచించారు. ఎన్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హరియాన్ చెరువు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ను నిర్వహించారు. బిపి, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. టీకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఎం.ఎల్.హెచ్. పి.ఝాన్సీ, సచివాలయం ఏఎన్ఎం అశ్విని, 104 సిబ్బంది డీఈఓ సాయి, గణేష్, ఆశా కార్యకర్త మీనాక్షి పాల్గొన్నారు.

శ్రీ జ్ఞాన సాయి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : పంజాబ్‌లో జరిగిన15వ జాతీయ డాన్స్ స్పోర్ట్ ఛాంపియన్షిప్ 2025లో శ్రీ జ్ఞానసాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు సత్తాచాటినట్లు కరస్పాండెంట్ కనేకంటి కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. ఈనెల 19,20న పంజాబ్లోని ఘర్షంకర్‌లో జరిగిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో 15 మంది విద్యార్థులను జాతీయ స్థాయికి పంపినట్లు చెప్పారు. జిల్లా నుండి శ్రీ జ్ఞానసాయి విద్యానికేతన్ విద్యార్థులు శివ సుబ్రహ్మణ్యం 6వ తరగతి (బాలీవుడ్ స్టైల్) జూనియర్స్ -2 క్యాటగిరిలో ప్రతమ స్థానం, బద్రీనాథ్ 5వ తరగతి (బాలీవుడ్ స్టైల్) జూనియర్-2 క్యాటగిరిలో ద్వితీయ స్థానం పొందారని అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సురేందర్‌రెడ్డి, ప్రెసిడెంట్ డా.మురళీ కృష్ణ, ఏపీ డాన్స్ స్పోర్ట్ అసోసియేషన్ కోచ్ డా.మనోహర్ తెలిపారు.

వలస పిల్లలకు వ్యాక్సినేషన్

విశాలాంధ్ర-నంబులపూలకుంట: బందారుచెట్లపల్లి గ్రామంలో శనివారం ఆరోగ్య సిబ్బంది వలస వచ్చిన పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. గ్రామ గ్రామాలు తిరుగుతూ ఉన్న వలస కార్మికులతమ పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించలేక పోతున్న వారిని గుర్తించి అటువంటి పిల్లలకు రోగనిరోధక శక్తిని పెంచే సూది మందులు వేశామని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో సి హెచ్‌వో నాగలక్ష్మి, సూపర్వైజర్ మహేశ్వర్ రెడ్డి,హెల్త్ అసిస్టెంట్ రమేష్ రెడ్డి తదితర వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్యప్రాణుల నుండి పంటను కాపాడండి

కొంకల్లు గ్రామ రైతు మొర

విశాలాంధ్ర-గుడిబండ : మండలంలోని కొంకల్లు గ్రామానికి చెందిన రైతు మాహలింగప్ప తనకు చెందిన నాలుగు ఎకరాల్లో పుచ్చకాయ పంటను సాగు చేశాడు.పంట దిగుబడి వచ్చే సమయంలో రాత్రి వేళల్లో ఎలుగుబంట్లు తన పంటను నాశనం చేస్తున్నా యని, ఫారెస్ట్ అధికారులు వన్యప్రాణుల ఎలుగుబంటి అడవి పందులు తదితర వన్యప్రాణులను ఫారెస్ట్ ప్రాంతాలలో తీసుకెళ్లి వదలాలని కోరారు.

50 మంది రక్త దానం

విశాలాంధ్ర-గోరంట్ల: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో దిలీప్ బిల్డ్ కాన్ లిమిటెడ్ సంస్థ వారు రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. 50 మంది రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో బెంగళూర్ టూ విజయవాడ ప్యాకేజీ-1 జనరల్ మేనేజర్ మనీష్ చంద్ర దీక్షిత్,మేనేజర్(సేఫ్టీ) వికాస్ కుమార్,ప్రాజెక్ట్ టీం మెంబెర్స్,కొండాపురం పీ హెచ్ ఐ మెడికల్ ఆఫీసర్ డా.మాధవి, సిహెచ్ఓ నీలావాణి ,చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ జిల్లా రిసోర్స్ పర్సన్ రమేష్ యాదవ్,జోనల్ సూపర్వైజర్ వెంకట్,లింక్ వర్కర్ రాజశేఖర్, బి.సి.టి.వి ల్యాబ్ టెక్నీషియన్లు సోమశేఖర్,చిట్టి బాబు, ఎమ్.ఎల్.హెచ్.పి శిల్పా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 26, జనవరి 2025

పేకాట రాయుళ్లు అరెస్టు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని కురువల్లి గ్రామ శివారులో శనివారం పేకాట ఆడుతున్నా ఆరు గురిని బొమ్మనహాళ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన వివరాలు మేరకు.. కురువల్లి గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు గ్రామ సమీపం లోని ముళ్లకంపలో పేకాట అడ్డుతున్నారని సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడులు నిర్వహించి ఆరు గురిని అదుపులోకి తీసుకోని వారి వద్ద నుంచి రూ.7100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దేశ స్థాయిలో అవార్డు దక్కించుకున్న హానకనల్ గ్రామస్తులు

విశాలాంధ్ర-కణేకల్లు: మండల పరిధిలోని జిల్లా హానకనల్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాటశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాటిల్ గీతారెడ్డి, మహాలక్ష్మిలు గైడ్ టీచర్ మేడ ప్రసాద్ మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రదర్శించిన ఎగ్జిబిట్‌కు దక్షిణ భారత దేశ స్థాయిలో స్పెషల్ అవార్డ్స్ దక్కించుకున్నారు.

పార్టీ మారిన 6 నెలలకు సస్పెండ్ చేయడం సమంజసమా?

- మహిళా నాయకురాలుగా గౌరవం లేదు..
- వైసీపీలో అభివృద్ధి శూన్యం
- కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చూసి పార్టీ మారాను
- బ్రహ్మసముద్రం మండల జడ్పిటిసి ప్రభావతమ్మ

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి ఆరు నెలల క్రితమే రాజీనామా చేశానని బ్రహ్మసముద్రం మండల జడ్పిటిసి ప్రభావతమ్మ పేర్కొన్నారు. శనివారం తెదేపా పార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడుతూ వైయస్సార్ పార్టీలో గెలిచినది వాస్తవమేనని, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ కంటే ఎక్కువ మెజార్టీతో గెలిచినా ఆ పార్టీలో నాకు గౌరవం దక్కలేదన్నారు. ఐదు సంవత్సరాల అధికార పార్టీలో ఉన్న కుమ్ములాటలు తప్ప అభివృద్ధి శూన్యం అన్నారు. ఆ పార్టీ కుమ్మలాటలలో నలిగిపోయామన్నారు. ఏనాడు నేను పదవుల కోసం పనిచేయలేదని, మండల అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేశానన్నారు.

స్థానిక శాసనసభ్యులు సురేంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని భావించి బ్రహ్మసముద్రం మండల అభివృద్ధి కోసం ఆరు నెలల క్రితమే తెలుగుదేశం పార్టీలో చేరితే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు నేడు పార్టీ నుంచి సస్పెండ్ చేశామని పత్రికలలో ప్రచారం చేయడం బాధ కలిగించిందన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలలో నియోజకవర్గంలో ఏ ఒక్క సీసీ రోడ్లు వేసిన దాఖలాలు లేవన్నారు. చేతనైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శాసనసభ్యులు సురేంద్రబాబు చేస్తున్న అభివృద్ధికి సహకరించండి, లేదంటే విమర్శలు మానండి అని వైసిపి నాయకులకు హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాల వెంకటాపురం శ్రీరాములు, కురువ సంఘం డైరెక్టర్ నీలా స్వామి, సీనియర్ నాయకులు ఆర్జీ శివశంకర్, వెంకటేశులు, మోహన్, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణదాతగా నిలుస్తున్న తరిమెల బండి ఓంనాథ

విశాలాంధ్ర-శింగనమల: తరిమెల గ్రామం ఈ పేరు వినగానే గుర్తొచ్చే పేరు విప్లవ యోధుడు, బడుగు వర్గాల ఆశాజ్యోతి కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి. ఇదే గ్రామంలో పుట్టి అనంతపురం, కర్నూలు, తిరుపతి లాంటి చోట్ల రక్త దానం చేపిస్తూ మానవతా విలువలు కాపాడే ప్రయత్నం చేస్తున్నారు బండి ఓంనాథ. మానవతా సంస్థ కన్వీనర్ తరిమెల అమర్నాథ్ రెడ్డి స్పూర్తితో వారి అమ్మ పేరు మీద లక్ష్మి రక్త దాతల సంస్థ అనే ఒక సంస్థను 12మే 2021లో మాతృ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసి ఇప్పటి వరకు దాదాపు 1,408 మంది రక్త దాతలను సమకూర్చి ప్రాణదాతలు అవుతున్నారు. దాదాపు 1500 మంది రైతులకు సమగ్ర సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి ఉన్న వారికి ఉచిత సలహాలు, సూచనలు అందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన సంఘమిత్ర సంస్థ బెస్ట్ ఆర్గానిక్ రీసెర్చ్ ఫార్మర్ ట్రైనర్ అవార్డును 23డిశంబర్ 2023న ఇచ్చారని, ఈ సేవలన్నింటినీ గుర్తించిన భారత మానవ హక్కుల సంఘం జాతీయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పదవిని ఇచ్చిందన్నారు.

మార్పు తెచ్చిన మొదటి రక్త దానం 2019 ఫిబ్రవరి 14 తేదీన హిందూపురంలో ఏ పాజిటివ్ రక్తాన్ని ఒక గర్భవతికి ఇచ్చానని,, అప్పుడు ఆ అమ్మాయి నేను అనాథను అన్నా నాకు అన్న తమ్ముళ్లు ఎవరు లేరు, మీరే మా అన్న అనుకుంటాను మా పాప కు మీరే మేనమామ గా పేరు పెట్టండని, అప్పుడు మా అమ్మ గారి పేరు పెట్టి వచ్చానన్నారు. నేను ఒకరికి సహాయం చేస్తే ఇంత గౌరవం ఇచ్చారు అదే ఇంకా వందల మందికి సేవ చేయాలని సదుద్దేశంతో ఒక సంస్థను ఏర్పాటు చేసి రక్తదానం చేయిస్తూ వస్తున్నానని. రక్తం కావాలి అన్న వెంటనే స్పందించి రక్తదానం చేసిన నా స్నేహి తులు, శ్రేయోభిలాషులు అందరికీ కృతజ్ఞతలు తెలుయజేశారు.

ఉత్తమ బీఎల్ఓ అవార్డు అందుకున్న వీఆర్వో సి.అంజలి

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉత్తమ బిఎల్ఓగా ఉరవకొండ మండలం కౌకుంట్లలో వీఆర్వోగా విధులు నిర్వహించిన సి.అంజలి ఎన్నికయ్యారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో రాష్ట్ర ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఐఏఎస్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యం లో ఉత్తమ బీఎల్ఓ అవార్డుతో పాటు రివార్డు కూడా అందు కున్నారు. ప్రస్తుతం అంజలి కనేకల్ మండలంకు బదిలీపై వెళ్లి విధులు నిర్వహిస్తున్నారు.

యువత ఓటు హక్కును కలిగి ఉండాలి

విశాలాంధ్ర-శింగనమల: 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవం కార్యక్రమం ప్రిన్సిపల్ సుప్రియ అధ్యక్షత వహించగా తహసిల్దార్ బ్రహ్మయ్య. డిప్యూటీ తాసిల్దార్ ప్రకాష్ రావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ యువత ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని కళాశాల విద్యార్థిని విద్యార్థులకు సూచించారు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జూనియర్ కళాశాల లెక్చరర్లు, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, వీఆర్వో తాతయ్య,సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ మధుసూదన్, మహిళా పోలీస్ శిల్ప పాల్గొన్నారు,

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

విశాలాంధ్ర-పెనుకొండ: 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 158-పెనుకొండ అసెంబ్లీ నియోజక వర్గ ఎన్నికల అధికారి రెవిన్యూ డివిజినల్ అధికారి ఆనందరావు వారి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినుల సమక్షంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. పెనుకొండ డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, పెనుకొండ తహశీల్దారు శ్రీధర్, ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమములో 18 సంవత్సరములు పూర్తి అయి యువతీ యువకులు ఓటరు గా నమోదు చేసుకోవాలని తెలిపారు. సీనియర్ సిటిజన్లు మరియు దివ్యాంగు లను సన్మానించారు. వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ర్యాలీ నిర్వహించారు

బాధ్యతగా ఓటును వినియోగించాలి

విశాలాంధ్ర-రాప్తాడు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకోవాలని తహశీల్దార్ పి.విజయకుమారి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం రాప్తాడు తహశీల్దార్ కార్యాలయంలో ఈడిటి సువర్ణ, ప్రజలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఓటు విలువైనదన్నారు. ప్రజాస్వామ్యంలో మనకు ఉన్న అత్యంత శక్తివంతమైన అహింసా సాధనం ఇదేనని జాన్ లూయిస్ అన్న విషయాన్ని తహశీల్దార్ గుర్తు చేశారు. యువతను ఓటర్లుగా నమోదు చేయించడం, వారికి ఓటర్ గుర్తింపు కార్డులు మంజూరు చేయడంపై దృష్టి పెట్టిందని, ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం అమలులోకి వచ్చిన రోజును జాతీయ ఓటర్ల దినోత్సవంగా నామకరణం చేసిందన్నారు. 18ఏళ్ళు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-రొళ్ల: ప్రజా స్వామ్య దేశంలో ఓటు ప్రజా ఆయుధమని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు.శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు ఓటు హక్కు ప్రజల చేతుల్లో ప్రజా ఆయుధమని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో అంగన్వాడీ కార్యకర్తలకు ముగ్గులు పోటీలు నిర్వ హించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరియప్ప, ఈ.ఓ.ఆర్.డి బాబురావు రెవెన్యూ సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

ఓటు ఎంతో విలువైనది..

విశాలాంధ్ర-గుడిబండ: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని. డిప్యూటీ తహశీల్దార్ రాం భూపాల్ రెడ్డి తెలిపారు. 15 వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా బిఎల్వోలు సచివాలయ ఉద్యోగులు కలిసి తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని. ఆయా పరిధిలోనే బిఎల్‌వోలకు దరఖాస్తులు అందజేయా లన్నారు ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో ఈ ఓటు ఎంతో విలువైనదని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రాజు, సర్వేర్ జై చంద్ర, బి ఎల్ ఓ సంధ్యారాణి, వీఆర్ఏ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం

విశాలాంధ్ర-పెనుకొండ: పరిటాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతిశాస్త్రం ఎన్ఎస్ఎస్ ల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రిన్సిపాల్ డా కేశవరావు అధ్యక్షతన జరిగినది, ఓటును ప్రతి పౌరుడు సద్వినియోగ పర్చుకొన్నపుడే ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షింప బడుతుందని తెలిపారు

ప్రతి విద్యార్థి ఓటు పట్ల అవగాహన కలిగి ఉండి సమర్థతకు ఓటెయ్యాలని వైస్ ప్రిన్సిపాల్ డా కే జయప్ప పేర్కొన్నారు.నోటుకు ఓటు అమ్ముకునే స్థితి నుండి ప్రతి ఓటరు బయట పడాలని యశోదరాణిపిలుపునిచ్చారు.రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డా పి యల్ కాంతారావు మాట్లాడుతూ దేశ ద్రోహులకు, అవినీతి పరులకు యువత లోబడకుండా,సమర్ధులకు పట్టంకట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా కే ప్రతాప్, పి.సంజీవరెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కరుకు బీజేపీ నాయకుల నివాళులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ఆదేశాల మేరకు బీజేపీ పార్టీ ముదిగుబ్బ మండల కన్వీనర్ బసిరెడ్డి అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఈ సంవిధాన్ దివస్ (రాజ్యాంగం దినోత్సవం) సందర్భంగా ముదిగుబ్బ మండలంలోని ప్రతి ఒక్క గ్రామము వార్డు,బూత్‌లలో ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సోముల ప్రకాష్ నాయుడు, నాయకుల పెద్దన్న, గంగాధరరెడ్డి, ప్రసాద్ సోమల ప్రకాష్,ఫణీంద్ర, బాబు, చిన్నకోట్ల చంద్ర,రాము పాల్గొన్నారు

ఓటు ఆవశ్యతపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-అగళి : ఓటు ఆవశ్యతపై శనివారం పురవీధులగుండా తహసీల్దార్ సుబ్బారావు ఆధ్వర్యంలో బిఎల్వోలు సచివాలయ ఉద్యోగులు గుప్తా కళాశాల విద్యార్థులు తో కలిసిఅవగాహన ర్యాలీ చేపట్టారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తాహసిల్దార్ సుబ్బారావు తెలిపారు. బస్ స్టాండ్ ఆవరణంలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని. ఆయా పరిధిలోనే బి ఎల్ వో లకు దరఖాస్తులు అందజేయాలన్నారు ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో ఈ ఓటు ఎంతో విలువైనదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ చంద్రశేఖర్ సీనియర్ అసిస్టెంట్ గుర్రన్న వీఆర్వో లు దొడ్డెగౌడ్ నరసింహమూర్తి కళాశాల ప్రిన్సిపాల్ రఘురామ్ బిఎల్వోలు కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఓటు ప్రాధాన్యం తెలియజేసేందుకు, పౌరుల బాధ్యతను, వారి భవిష్యత్ ఉన్నతికి తోడ్పడే ఓటు విలువ తెలిసేలా నేషనల్ ఓటర్స్ డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మమత మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే అర్హులైన వారందరూ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఖాదర్, శివ, షానవాజ్ విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని. డిప్యూటీ తాసిల్దార్ బాలాంజనేయులు, ఎంపీడీవో నటరాజు తెలిపారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా బిఎల్వోలు సచివాలయ ఉద్యోగులు కలిసి నాలుగు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ ఐ కిరణ్ కుమార్, వీఆర్వోలు భార్గవ్ ,ఉష, మరియు బిఎల్వోలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ..

విశాలాంధ్ర-హిందూపురం : కేంద్ర, రాష్ట్ర పార్టీ సూచన మేరకు సంవిధాన్ గౌరవ్ అభియాన్, జాతీయ ఓటరు దినోత్సవాన్ని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజ్యంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ, రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, బిజెపి అధికారం చేపట్టిన నాటి నుండి నేటి వరకు రాజ్యాంగ స్ఫూర్తిని చాటడం జరిగిందని, కానీ 55 సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ వారి స్వప్రయోజనాలకోసం 77 సార్లు రాజ్యాంగ సవరణ చేసిందని, బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన 16 సంవత్సరాలలో కేవలం దేశ ప్రజల హితం కోసం 22 సార్లు మాత్రమే సవరణ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దాహంతో ప్రభుత్వాలను కూల్చి, రాష్ట్రపతి పాలన విధించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, కానీ ఒకసారి కూడా బీజేపీ ప్రభుత్వం అలా చేయలేదు రాజ్యాంగాన్ని గౌరవించి ఒక్క ఓటు తక్కువ ఉన్న కారణంగా, ప్రధానిగా ఉన్న వాజపేయి ప్రభుత్వాన్ని రద్దు చేసుకుందని, కనీసం ఈరోజు అంబేద్కర్ గురించి రాజ్యాంగం గురించి మాట్లాడే ఈ కాంగ్రెస్ నాయకులు, ఆనాటి ప్రత్యక్ష ఎన్నికలలో అంబేద్కర్‌ని ఓడించారని, కనీసం వారి చిత్రపటాన్ని పార్లమెంట్‌లో పెట్టలేదన్నారు. అంబేద్కర్‌ని గౌరవించి బిజెపి కూటమి ప్రభుత్వంలో భారతరత్న ఇచ్చిందన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తు చేసుకోవాలని సూచించారు.

కల్యంలో మినరల్ ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : మండలంలోని కల్యం గ్రామంలో గత ఐదు సంవత్సరాలుగా మూతపడిన శుద్ధ జల కేంద్రానికి మరమ్మత్తులు చేయించి, త్వరితగతిన శుద్ధ జల కేంద్రానికి నూతన రూపురేకులు మార్చి శనివారం ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ధనంజయ ప్రారంభించారు. గ్రామంలో ఇతర గ్రామాల నుంచి వచ్చే ఆటోలో శుద్ధ జల నీరును వాడుకునేవారు. అయితే వైకాపా ప్రభుత్వం మునుపన శుద్ధజల కేంద్రానికి మరమ్మత్తులు రావడంతో పట్టించుకోకపోవడంతో కేంద్రం మూతపడింది. నూతనంగా మండలానికి విచ్చేసిన ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ధనుంజయ చొరవతో తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞ అభివందనాలు తెలియజేశారు.

నూరు ఏళ్ల వృద్ధునికి సన్మానం

విశాలాంధ్ర-తాడిపత్రి: జాతీయ ఓటర్ దినోత్సవ సందర్భంగా నూరు సంవత్సరాల వృద్ధునికి ఘనంగా సన్మానం చేసినట్లు తాసిల్దార్ రజాక్ వలి పేర్కొన్నారు. శనివారము తాసిల్దార్ కార్యాలయంలో 15వ జాతీయ ఓటర్ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మొదటగా ప్రభుత్వ జూనియర్ కాలేజి నుండి అశోక్ పిల్లర్ సర్కిల్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని పోలింగ్ కేంద్రం 251లో గల 100 సంవత్సరం వయసు గల ఓటర్ ఖాదర్ సాబ్ కి శాలువా, పూల దండతో సన్మానం చేశారు. ఎంఈఓ నాగరాజు మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ ఎలక్షన్ డిటి నాగేంద్ర ఇంచార్జ్ ఆర్ఐ రామ్మూర్తి వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి పల్లకి ఉత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ: మండలంలోని పెన్నాహోబిలం లక్ష్మీనరసిం హస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం కార్యక్రమం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలవ దీర్చి ఆలయము చుట్టూ ప్రదక్షణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సాకే రమేష్ బాబు అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక గొర్రెల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం లత్తవరం గ్రామంలో శనివారం ప్రాథమిక గొర్రెల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. లక్ష్మీ నరసింహ ప్రాథమిక గొర్రెల పెంపకం దార్ల సహకార సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించి ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించినట్లు ఎన్నికల అధికారగా వ్యవహరించిన పశుసంవర్ధక శాఖ డాక్టర్ పల్లా మహేష్ తెలిపారు. అధ్యక్షులుగా ధనంజయ, ఉపాధ్యక్షులుగా బట్టు నాయక్, డైరెక్టర్లుగా బన్నెల రాము, బన్నెల రమేష్, మహేష్ నాయక్, భీమా నాయక్, చిన్న ఎల్లప్ప తో పాటు ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. లత్తవరం మాజీ సర్పంచ్ బోధపాటి గోవిందప్ప మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులతో పాటు పశుసంవర్ధక శాఖ సిబ్బంది లావణ్య అనిల్ వీరితోపాటు గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షునికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-శెట్టూరు: భారతీయ జనతా పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుగా నూతనంగా ఎంపికైన కొనకొండ్ల రాజేష్‌ను శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో కలిసి శెట్టూరు బిజెపి మండల అధ్యక్షుడు నాగరాజ్ యాదవ్ శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో బిజెపి పార్టీ స్థితి గతులను గురించి అడిగి తెలుసుకుని జిల్లా పార్టీ నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పార్టీ మండల నాయకులు నగేష్, విజయ్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌకనపల్లిలో సంవిధాన్ గౌరవ్ అభియాన్

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండలంలోని గౌకనపల్లి పంచాయతీ లో శనివారం బిజెపి మండల అధ్యక్షుడు షేక్ బాబ్జాన్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి "సంవిధాన్ గౌరవ్ అభియాన్" కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగ ప్రతిని ప్రజలకు చదివి వినిపించారు. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మతాలను వాడుకుంటూ అంబేద్కర్ రచించిన చట్టాలను బీజేపీ చెరిపి వేస్తున్నదని తప్పుడు ప్రచారం చేస్తున్నదని, నిజమేమిటంటే వారు ప్రజల మీద బడుగు బలహీన వర్గాల మీద సవితి ప్రేమ చూపిస్తూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ని ఏ రోజు గుర్తు చేసుకోలేదన్నారు.

ఆర్‌డీటీ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్లలోని పులేరు రోడ్డులో గుడారాలు వేసుకొని సంచార జీవితం జరుపుతున్న వారి పిల్లల విద్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రధానోపాధ్యా యుడు దేవాంగం జగదీశ్వర్ ఏర్పాటుచేసిన శ్రీ సత్య సాయి అక్షర జ్యోతి శిక్షణ కేంద్రంలో విద్యను కొనసాగిస్తున్న పిల్లల క్రీడాశక్తిని ఆర్డిటి రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ గుర్తించారు, అలాగే క్రీడా సామాగ్రిని పిల్లలకు శనివారం అందజేసి, పిల్లలతో మమేకమై వారి విద్యా ప్రగతిని పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు, భవిష్యత్తులో వారికి అవసరమైన సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఎటిఎల్ నరసింహారావు, ప్రతాప్ రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి...

విశాలాంధ్ర-అగళి : మండలంలోని బీసీ,బ్రాహ్మణ వైశ్య, కాపు,మైనారిటీ, కార్పొరేషన్ ద్వారా రుణాల పొందేందుకు ఓబి ఎంఎంఎస్ ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో యాదవేంద్ర తెలిపారు. 21 ఏళ్లు నిండి60 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఒక్క యూనిట్ విలువ రెండు లక్షల నుండి 5 లక్షల వరకు ఉంటుందన్నారు, ప్రధానమంత్రి జనరిక్ మెడికల్ షాప్ ఏర్పాటు కోసం కూడా దరఖాస్తుల స్వీకరిస్తున్నామని, బి ఫార్మసీ ఎం ఫార్మసీ పూర్తి చేసిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కార్పెంటర్ మృతి.. ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని కాజా అను కార్పెంటర్ అనారోగ్యంతో మృతి చెందడంతో శ్రీ విశ్వకర్మ కార్పెంటర్స్ అసోసియేషన్ తరపున 12 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశామని కార్పెంటర్స్ అసోసియేషన్ వారు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల సహాయ సహకారాలు నగదు అందజేయడం జరిగిందని తెలిపారు.

సమన్వయంతో అభివృద్ధి చేసుకుందాం

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రభుత్వ అధికారులు గ్రామ ప్రజలు సమన్వయంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని బంజారా సంఘం జాతీయ నేత టీడీపీ సీనియర్ నాయకులు ఎన్.కె కేశవ నాయక్ తెలిపారు. శనివారం వజ్రకరూరు మండలం రూపా నాయక్ తండా గ్రామపంచాయతీలో రచ్చ కట్టపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం లో రెవెన్యూ నీటిపారుదల శాఖ పంచాయతీరాజ్ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచం లో అభివృద్ధి వేగవంతంగా జరుగుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా మనం కూడా అభివృద్ధి దిశలో పయనించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం గ్రామ అభివృద్ధికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామస్తులు, అధికారులు చర్చించారు. గ్రామంలో అక్రమ కట్టడాలు, రోడ్డుపై మురికి నీరు సీసీ రోడ్డు నిర్మాణం డ్రైనేజీ లీకేజీ వాటర్ గురించి ప్రత్యేకంగా చర్చలు చేశారు బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వర్లు నీటిపారుదల శాఖ ఏఈ మంజునాథ్ రెవెన్యూ అధికారి ముత్యాలు బంజారా సంఘం నేతలు ఎస్కే దాసు నాయక్, మాజీ జెడ్పిటిసి తులసీదాస్ నాయక్, నంగరేర్ నాయక్, సుబ్రహ్మణ్యంతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

యత్వా ఎనర్జీ సెల్యూషన్స్‌తో జేఎన్టీయూ ఒప్పందం

విశాలాంధ్ర-జెఎన్టియుఏ: జేఎన్టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం సెమినార్‌లో యత్వా ఎనర్జీ సెల్యూషన్స్ ప్రవేట్ లిమిటెడ్, హైదరాబాద్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. చెన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నా రెడ్డి మాట్లాడుతూ .. ఒప్పందంతో విద్యార్థులకు ప్రగతికి తోడ్పాటునందించి సెమినార్లు, వర్క్ షాపులు, షార్ట్ టర్మ్ ట్రైనింగ్ ప్రోగ్రాములను నిష్ణాతులైన ఇండస్ట్రీ ఎక్స్ పర్ట్స్ తో నిర్వహించనున్నారని, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, రీసర్చ్ కొలాబ రేషన్, కన్సల్ టేన్సీ, ప్రాజెక్టులు ఇవ్వనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ జి. రవి మారుతి రెడ్డి డైరెక్టర్ (1980-84 కళాశాల పూర్వ విద్యార్థి) యత్వా ఎనర్జీ సొల్యూషన్స్ ప్రవేట్ లిమిటెడ్, హైదరాబాద్ మాట్లాడుతూ.. ఈ కళాశాల పూర్వ విద్యార్థిగా ఈ ఒప్పందం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎలక్ట్రికల్ విభాగం లో ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుం దన్నారు. ప్లేస్ మెంట్, ఎలక్ట్రికల్ లైన్స్, టెస్టింగ్ పైన తర్ఫీదు ను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎం. రామ శేఖర రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆచార్య ఎం. విజయ కుమార్, ఆచార్య పి.సుజాత, ఆచార్య ఆర్.కిరణ్మయి, ఆచార్య ఎస్. విశాలి, డాక్టర్ ఎం.అంకారావు, డాక్టర్ జితేంద్రగౌడ్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జే. శ్రీనివాసులు, మాజీ ఆచార్యులు వి.శంకర్, రవిశంకర్, పి.రమణ మూర్తి, శ్యాంబాబు, యత్వా నుంచి నీలాంజనేయులు, బోధన, బోధనేతర సిబ్బంది పవర్ హౌస్ సిబ్బంది పాల్గొన్నారు.